

అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-విజయనగరం కోట

అగ్నిపథ్ పథకంలో భాగంగా భారతీయ వాయుసేనలో అగ్నివీర్(వాయు) నియామకాల కోసం కమాండింగ్ ఆఫీసర్, 12 ఎయిర్‌మెన్ సెంటర్, సికింద్రాబాద్ నుంచి నోటిఫికేషన్ విడుదల అయినట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. ఇంటర్మీడియెట్ ఎంపిసి గ్రూపులో లేదా పాలిటెక్నిక్ లేదా ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇంగ్లీషు సబ్జెక్టులోనూ అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అభ్యర్థులు 2004 జులై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య మధ్య జన్మించిన వారై వుండాలని తెలిపారు. అగ్నివీర్(వాయు)లో నియామకం కోసం స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు జూలై 8నుంచి 28వ తేదీలోగా https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఆన్‌లైన్ పరీక్ష అక్టోబరు 18వ తేదీన జరుగుతుందని పేర్కొన్నారు.

గుర్లగెడ్డ కుడికాలువను పరిశీలిస్తున్న డిఇ గోవిందరావు

గుర్ల గెడ్డ సాగునీటి ప్రాజెక్టుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పాతికేళ్లగా సాగునీటి కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ మారిన ప్రతిప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో, ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలంటూ సిపిఎం నాయకత్వంలో ఎపి రైతు సంఘం, కౌలుదారుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆధ్వర్యాన దశాబ్దాలు తరబడి పోరాడుతునే ఉన్నాయి. మధ్యంతరంగా పలు మార్లు అంచనా వ్యయాలు తయారు చేసినప్పటికీ ఆచరణలో నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉండి పోయింది. తాజాగా ప్రభుత్వం మారడంతో ఈ సమస్యను మరోసారి ఈ సంఘాల నాయకులు, రైతులు జిల్లాకు చెందిన రాష్ట్ర సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి, కలెక్టర్ ప్రాజెక్టును సందర్శించి రిపోర్టును అందజేయాలంటూ సంబంధింత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో, ఈనెల 3, 5 తేదీల్లో డిఇలు గోవిందరావు, పాండు ప్రాజెక్టును సందర్శించారు. కాలువల పరిస్థితిని చూశారు.

గుర్లగెడ్డపై చిగురిస్తున్న ఆశలు

- పట్టువీడని రైతు సంఘం, సిపిఎం
- మంత్రి ఆదేశాల మేరకు ప్రాజెక్టును సందర్శించిన ఇంజినీర్లు
- ఫారెస్టు అనుమతులు లేవనే సాకుతో 21 ఏళ్లుగా కాలక్షేపం
- పాతికేళ్లుగా రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మెంటాడ మండలం రొంపల్లి పరిధిలో గుర్ల గెడ్డ జలాశయాన్ని 2000లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.4.28కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2900 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది అప్పటి లక్ష్యం. వాస్తవానికి జలాశయం గట్టు పొడవు, ఎత్తు పెంచితే సుమారు 8వేల ఎకరాల వరకు సాగునీరు అందించవచ్చని సాగునీటి పారుదల శాఖ ఇంజినీర్లు అప్పట్లో చెప్పారు. ఇందుకు అనుగుణంగా ప్రాజెక్టు డిజైన్‌ను అప్‌గ్రేడ్ చేసి తగిన నిధులు కేటాయించాలని అప్పట్లో సిపిఎం నాయకులు కీర్తిశేషులు ఆర్.కుప్పానాయుడు ఆధ్వర్యాన రైతులు పెద్దపోరాటమే చేశారు. అయినా పట్టించుకోని ప్రభుత్వం 2,900 ఎకరాల ఆయుకట్టుకే పరిమితం చేసి పనులు ప్రారంభించింది. ప్రధాన గట్టును దాదాపు నిర్మించినప్పటికీ, కొండవరకు ఉన్న 150 మీటర్ల మేర గట్టును అటవీ శాఖ అనుమతులు లేవనే సాకుతో అసంపూర్తిగా వదిలేసింది. ఇప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేవనే చెబుతున్నారు. మరోవైపు ఎడమ కాలువ ద్వారా నీటిని మళ్లించేందుకు జలాశయం నుంచి సుమారు కిలోమీటరు పొడవున అక్విడెక్టు నిర్మించారు. కుడికాలువ పనులు ఆదిలోనే హంసపాదులా నిలిచిపోయాయి. ఇదంతా 2004 ఎన్నికలకు ముందు మాట. ఆ తరువాత ప్రభుత్వం దీని గురించి పట్టించు కోకపోవడంతో అక్విడెక్టు మరమ్మతులకు గురైంది. రెండు చోట్ల పిల్లర్స్ కూడా విరిగిపోయాయి. అసంపూర్తిగా వున్న జలాశయ గట్టు యథాతథంగానే ఉంది. దీంతో, జలాశయం ద్వారా సాగునీరు అందని పరిస్థితి. జలాశయానికి పైనవున్న కొండకోనల నుంచి వచ్చిన నీరు గుర్లగెడ్డ ద్వారా చంపావతిలో కలిసిపోతుంది. ఈ సమస్యను సిపిఎం, ఎపి రైతు సంఘం మారిన ప్రతి ప్రభుత్వానికీ విన్నవించింది. ఆయా సందర్భాల్లో ప్రజలకు నాయకులు హామీలు ఇవ్వడం, ఆ తరువాత ప్రభుత్వానికి లేఖలు రాయడం మినహా ఒత్తిడి చేయలేదు. దీంతో, ఈ సాగునీటి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఎన్నికల సమయాల్లో మాత్రం దీనిపై హామీలు గుప్పిస్తూ వస్తున్నారు. అందుకు తగ్గట్టు నిధులు కేటాయించకపోయినా సాగునీటి పారుదల శాఖ ద్వారా అప్పుడప్పుడు అంచనాలు తయారు చేయడం పరిపాటిగా మారింది. ఇందులో భాగంగా గత ఏడాది రూ.16కోట్ల అంచనా రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అది కూడా అమలుకు నోచుకోలేదు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈసారి అధికారంలోకి వస్తే తప్పక ప్రాజెక్టు పూర్తిచేస్తామంటూ టిడిపి నాయకులు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నెరవేర్చాలంటూ సిపిఎం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వార్యాన మంత్రి, కలెక్టర్‌ను కలిసి గుర్తుచేయడంతో స్పందించారు. ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు ప్రాజెక్టును పరిశీలించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

గుర్ల గెడ్డ కుడికాలువ పరిశీలన

మెంటాడ : గుర్ల గెడ్డ కుడికాలువ ఆక్విడెక్టును ఆప్రాజెక్టు డిఇ గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామపెద్దలు డిఇని కలిసి ప్రాజెక్టు పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు. డిఇ స్పందిస్తూ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు రూ.20కోట్లు అవుతుందని, ఈమేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారవు. డిఇ వెంట గ్రామపెద్దలు చెలికాని రామునాయుడు, ఉప సర్పంచ్ మల్యాడ సింహాద్రి, రైతులు అప్పలనాయుడు, సింహాద్రి, జగదీష్, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

సహారా ఖాతాదారులను

మోసగించిన బిజెపి

- కేంద్ర ప్రభుత్వంపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని ఆగ్రహం
- 15న కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలి

సహారా ఇండియా ఖాతాదారులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసగించిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. వేల కోట్ల రూపాయలు కేంద్ర మంత్రి అమిత్‌షా కుమారుడు కాజేయాలని చూస్తున్నాడని మండిపడ్డారు. దీనిపై ఈ నెల 15న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు ఖాతాదారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సును ఉద్దేశించి తమ్మినేని మాట్లాడుతూ దేశంలో 13 కోట్ల మంది సహారా ఇండియా ఖాతాదారులను బిజెపి ప్రభుత్వం మోసం చేయడం అన్యాయని విరుచుకుపడ్డారు. పేద ప్రజలు, కార్మికులు తమ కష్టార్జితం దాచుకుంటే పిల్లల భవిష్యత్తుకు బాగుంటుందని సహారాలో డబ్బులు డిపాజిట్లు చేశారని తెలిపారు. గత 12 ఏళ్లుగా ఇచ్చిన బాండ్లను మారుస్తున్నారు తప్ప ఖాతాదారులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. ప్రజల డబ్బులతో అనేక రాష్ట్రాల్లో స్థిరాస్తులు కొన్నారని, వాటి విలువ ఇప్పుడు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని, వీటిని బిజెపి నాయకులు కొట్టేయడానికి కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. సహార్ ఇండియా ఆస్తులను బిజెపి కొల్లగొట్టకముందే మనం మేలుకోవాలని ఖాతాదారులకు విజ్ఞప్తిచేశారు.

రాష్ట్రంలో బిజెపికి సహకరిస్తున్న టిడిపి, జనసేన పార్టీలు ఈ సమస్యను కేంద్రంతో చర్చించి ఖాతాదారులకు డబ్బులు వచ్చేటట్లు చేయాలని సూచించారు. సహారా ఇండియా ఖాతాదారులందరూ సిఐటియు నాయకత్వంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటాల గడ్డ బొబ్బిలి నుంచే సహారా ఇండియా ఖాతాదారులు పోరాటాలకు నాంది పలకాలన్నారు. ఈ నెల 15న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు వేలాదిమంది తరలిరావాలని కోరారు. అప్పుడే పాలకవర్గాలు భయపడి సమస్యలు పరిష్కరిస్తారని వెల్లడించారు. సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఎజిపిగా ప్రవీణ్

ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన చిన్నాల ప్రవీణ్‌కుమార్ హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా నియమితులయ్యారు. రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న చిన్నాల పకీర్ నాయుడు తనయుడు ప్రవీణ్. ప్రవీణ్ నియామకంపై టిడిపి నాయకులు గంగు కృష్ణ, కర్రి రమణ, ఉప సర్పంచ్ గుండ పకీర్, అమరాన తిరుపతి హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే మాధవికి వినతి పత్రం అందజేస్తున్న జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

జ్యూట్ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక జ్యూట్‌మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నెల్లిమర్ల జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం కొండవెలగాడలో ఎమ్మెల్యే లోకం మాధవికి జ్యూట్‌మిల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం ఎప్పటికప్పుడు మిల్లు మూసి వేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తుందని తెలిపారు. జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి వసూలు చేసిన ఇఎస్ఐ, పిఎఫ్ ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. దీనివల్ల కార్మికులు పింఛను, ఇఎస్ఐ సౌకర్యాలూ పొందలేకపోతున్నారని చెప్పారు. జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి రిటైర్డు కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. జ్యూట్ కార్మికుల సమస్యలు డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లాలని, మిల్లు తెరిపించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిఐటియు నాయకులు కనకల రాము ఉన్నారు.

నా గెలుపు ప్రజా విజయం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-దత్తిరాజేరు

తన గెలుపు నియోజకవర్గ ప్రజల విజయమని రాష్ట్ర చిన్న తరహా, సెర్ప్,ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోమటిపల్లి జంక్షన్ వద్ద కళ్యాణ మండపంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విజయం సాధించేందుకు కృషి చేసిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. శాశ్వతంగా గుర్తు ఉండిపోయేలా పని చేసేందుకు మంత్రి పదవి దోహదపడుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబుపై నమ్మకంతో ప్రజలు, ముఖ్యంగా రాష్ట్ర యువత టిడిపికి పట్టం కట్టారని అన్నారు. రాష్ట్రంలో యువతకు ప్రాధాన్యతనిస్తూ తనకు మంత్రి పదవి ఇచ్చారన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు అరికట్టే విధంగా కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. రానున్న పదేళ్లు ఇదేవిధంగా కష్టపడితే దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలవొచ్చు అన్నారు. నాయకులకు, కార్యకర్తలుకు ఏ అవసరం వచ్చినా, కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానని, చిన్న చిన్న సమస్యలు ఉన్న మండల స్థాయి నాయకుల ద్వారా పరిష్కరించుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. కార్య క్రమంలో గంట్యాడ మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మర్రాపు.సురేష్, బిజెపి నాయకులు, దుర్గాప్రసాద్, బోడసింగి సత్తిబాబు, గుసిడి జగన్నాథం, చెల్లూరి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చిన్న తరహాపరిశ్రమల శాఖా మంత్రి శ్రీనివాస్

సందర్శకులను కలసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం : జిల్లాకు చేరుకున్న రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నగరంలోని జిల్లా పరిషత్ అతిథి గృహంలో శుక్రవారం సందర్శకులను కలిశారు. జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కె.ఆర్.డి.ప్రసాదరావు ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం మంత్రిని కలసి రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై వివరించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి ద్వారా రక్తం సేకరణ తదితర అంశాలపై వారి నుంచి మంత్రి సమాచారం తెలుసుకున్నారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యక్రమాలపై ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ మంత్రిని కలసి వివరించారు. జిల్లాలో సెర్ప్ ఆధ్వర్యంలో చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణచక్రవర్తి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సహకార శాఖ అధికారులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిశారు. వివిధ ప్రాంతాల ప్రజలు కూడా మంత్రిని కలిసి పలు అంశాలపై వినతులు అందజేశారు.

మంత్రి కొండపల్లికి ఆర్ఎంపి సంఘం శుభాకాంక్షలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు జోనల్ అధ్యక్షులు జంగం జోషీ, గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులో రాజకీయాల్లో తొలిసారిగా పోటీచేసి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డేవిడ్ భవాని, జిల్లా ప్రచార కార్యదర్శి కర్రి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బిఎన్ఎస్'ను రద్దు చేయాలని 10న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేస్తున్న భారత న్యాయ సంహిత చట్టం 106 (1,2) లను రద్దు చేయాలని, రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 10న దేశవ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రభుత్వ, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు అందరూ పాల్గొనాలని ఎఐఆర్‌టి డబ్ల్యుఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ధర్నా విజయవంతానికి కరపత్ర ప్రచారంలో భాగంగా కోట, బాలాజీ జంక్షన్, దాసన్నపేట, బాబా మెట్ట, నీల ట్యాంకు ఆటో స్టాండ్‌లలో, హుకుంపేట శుద్ధ వీధిలో పైడిమాంబ లారీ వర్కర్స్ యూనియన్, పెద్ద చెరువు గట్టు వద్ద ఉన్న శ్రీ విజయ దుర్గ లగేజ్ గూడ్స్ వెహికల్స్ డ్రైవర్స్ తో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలు డ్రైవర్లలకు, వీధి వ్యాపారులకు, సామాన్య ప్రజానీకానికి తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలతో పాటు ,ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని హైవే లు, రోడ్ల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీను,రాము నాయుడు, రాజు, లక్ష్మణ దొర, మారయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఫైర్

ఎంపిడిఒను కలిసిన సర్పంచుల బృందం

ప్రజాశక్తి - జామి

రాష్ట్రంలో ప్రభుత్వం మారినంత మాత్రాన గ్రామ సర్పంచుల అధికారాలు తగ్గిపోవని, ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ దెబ్బతీస్తే ఊరుకోబోమని మండలంలో పలు గ్రామాల సర్పంచుల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపిడిఓ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోకుండా, కొంత మంది టిడిపి కార్యకర్తల ఫిర్యాదులు మేరకు అధికారులు బొమ్మలు, శిలాఫలకాలు తొలగింపు చేయాలని నిర్ణయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలోనూ అదే జరిగిందని, గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా, చిల్లర వ్యక్తులను పక్కన పెట్టుకుని కొన్ని చోట్ల, వారి చేతుల మీదుగా ఇంకొన్ని చోట్ల పింఛన్లు పంపిణీ చేశారని గుర్తుచేశారు. పార్టీ గెలిచిందని రాజకీయ పార్టీల మనుషులకు పెద్దపీట వేసి, ప్రజల ఓట్లతో గెలిచే ప్రజాప్రతినిధులను అవమానిస్తే సహించబోమని హెచ్చరించారు. విత్తనాల పంపిణీ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించేలా, కిందస్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎంపిడిఒ.. ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్‌పై అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం ప్రతినిధులు కిలారి సూర్యారావు, అప్పాన సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సర్పంచ్‌కు విలువనీయరా?

మూల బొడ్డవర సర్పంచ్ మీణ

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మీణ

శృంగవరపుకోట : తనకు విలువనీయడం లేదంటూ శుక్రవారం బొడ్డవర గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో అధికారులపై మూలబొడ్డవర సర్పంచ్ దేవాపురపు మీణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభ షెడ్యూల్ తేదిని వార్డు మెంబర్లు, ఎంపిటిసిలకు తెలియజేశారు తప్ప తనకు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. గిరిజనులంటే ఈ ప్రాంత నాయకులకు ఎప్పుడూ చిన్నచూపేనని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా తీరు మార్చుకొని సర్పంచుకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

నకిలీ వాలంటీర్‌పై చర్యలు తీసుకోండి

పూసపాటిరేగ : మండలంలోని కొల్లాయివలస సచివాలయంలో విధులు నిర్వహించకుండా జీతం తీసుకున్న నకిలీ వాలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం టిడిపి మండల నాయకులు ఎంపిడిఒ రాధికకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొల్లాయివలస మాజీ సర్పంచ్ దువ్వు అప్పలస్వామి మాట్లాడుతూ సచివాలయంలో దువ్వు హేమలత గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వాలంటీర్‌గా పని చేసినట్లు చెప్పి గౌరవ వేతనం తీసుకుందన్నారు. ఆమెది తమ గ్రామం కాదని, విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఉంటుందని తెలిపారు. భీమిలికి చెందిన మహిళకు ఇక్కడ వాలంటీర్‌గా అవకాశం ఇచ్చి, గౌరవ వేతనం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆమె తీసుకున్న గౌరవ వేతనం తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని, ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిడిఒ రాధిక స్పందించి పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, నాయకులు పతివాడ తమ్మినాయుడు, ఆకిరి ప్రసాదరావు, పిన్నింటి శ్రీనివాసరావు, సామంతుల సోంబాబు, మురపాలు భోగేష్ ఉన్నారు.

లైంగిక వేధింపులను అరికట్టాలి

చట్టాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి • కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టాలని, వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టం-2013 అమలు పై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు, సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా మహిళలపై వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో అవగాహన కల్పించినప్పుడే, ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలవుతుందని అన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి సుమారు 11 ఏళ్లయినా ఇంకా అవగాహనా స్థాయిలోనే ఉండటం విచారకరమని పేర్కొన్నారు. చట్టం వల్ల తమకు రక్షణ లభిస్తుందన్న విషయం మహిళలకు తెలియాలని, ఈ చట్టం వారికి ధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రయివేటు కార్యాలయాల్లో కూడా చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్టాన్ని అమలు చేసేందుకు వివిధ కార్యాలయాల్లో ఏర్పాటైన కమిటీలు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదు చేయడమే కాకుండా, కఠినంగా శిక్ష పడినప్పుడే వేధింపులు నిరోధింపబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలతో పాటు అసంఘటిత రంగంలో కూడా అమలు చేయాలని కోరారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు, సురక్షితంగా, భద్రంగా ఉండాలన్నది ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. స్థానిక, అంతర్గత కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. అదనపు ఎస్‌పి అస్మా పర్హీన్ మాట్లాడుతూ, బాధితులకు న్యాయం జరిగేలా, వారి పక్షాన నిలిచేలా చట్టం అమలు ఉండాలని స్పష్టం చేశారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు భారతీయ న్యాయ సంహితలోని వివధ చట్టాలను వివరించారు. డిఆర్‌ఒ ఎస్‌డి అనిత మాట్లాడుతూ, పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం కింద కేసు పెట్టడమే కాకుండా, వారిపై సకాలంలో చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో బాధిత మహిళలకు తోటి మహిళలు అండగా నిలవాలని కోరారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, చట్టంలోని అంశాలను వివరిస్తూ ముద్రించిన హేండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, వివిధ శాఖల అధికారులు, సిడిపిఒలు, ఐసిడిఎస్ అధికారులు, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు

పని పదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం చట్టం-2013 జిల్లాలో పకడ్బందీగా అమలు కోసం నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి జిల్లా స్థాయికి తెలిపేందుకు నోడల్ అధికారులను నియమించారు. డివిజన్ స్థాయిల్లో మూడు డివిజన్‌లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, 27 మండలాల తహశీల్దార్‌లు, నలుగురు మున్సిపల్ కమిషనర్‌లను నోడల్ అధికారులుగా నియమిస్తూ తమ పరిధిలో వచ్చే ఫిర్యాదులకు సంబంధించి జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారికి నివేదించాలని ఆదేశించారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

కార్మికుడి కుటుంబానికి
రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-డెంకాడ

విద్యుదాఘాతంతో మృతిచెందిన పంచాయతీ కార్మికుడు దత్తి బంగారుబాబు కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, మండల కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మండలంలోని సింగవరం పంచాయతీలో లెంకపేటలో పారిశుధ్య పనులు చేస్తూ మరణించిన కార్మికుడు బంగారుబాబు కుటుంబాన్ని శుక్రవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు గాని, బీమా సౌకర్యం గాని ప్రభుత్వాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న వీరికి ఏ రకమైన హక్కులు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. కనీస వేతనాలు లేక, చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటూ కడు దీనమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీరికి ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనాలు, బీమా సౌకర్యం కల్పించాలని, రక్షణ పరికరాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజల రుణం తీర్చుకుంటా : కళా

ప్రజాశక్తి-మెరకముడిదాం

మెరకముడిదాం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఎంపిడిఒ ఎం.పావని, తహశీల్దార్ పద్మావతి ఆధ్వర్యాన అధికారులు ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పనితీరును వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రహదారులు, గ్రామాల్లో విద్యుత్తు, తాగునీరు, శానిటేషన్, రైతుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ముందుండాలని తెలిపారు. సమావేశంలో యువనాయకులు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, మాజీ ఎంపిపి కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, మండల రమణ మోహనరావు, తలచుట్ల ఈశ్వరరావు, పి.సీతారామరాజు, సుబ్బరాజు, పి.సన్యాసినాయుడు, కె.ధనంజయ, నాని పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని వసాది గ్రామంలో శుక్రవారం రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ రీజనల్ అధికారి ఆర్‌టిఎల్ ప్రకాశ్ మాట్లాడుతూ విత్తనశుద్ధి వల్ల తెగుళ్లను నివారించవచ్చున్నారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులకు బీజామృతం తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో ఎంటి ఈశ్వరమ్మ, ఎల్.ఎర్నిబాబు, ఎన్ఎఫ్ఎ అనిత రైతులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో షెడ్డుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయిలో దళితులకు శ్మశానవాటికలో షెడ్డు ఏర్పాటు కోసం పంచాయతీరాజ్ జెఇ మహమ్మద్ ఆలీ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. రూ.5 లక్షలతో షెడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. దహనసంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఇటీవల సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు ప్రజా వేదికలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో పిఆర్ జెఇ వచ్చి స్థల పరిశీలన చేసి, అంచనాలు రూపొందించారు.

పన్నుల వసూళ్లు ముమ్మరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తి, నీటి పన్ను వసూళ్ళను ముమ్మరం చేయాలని రెవెన్యూ సిబ్బందికి, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్నుల లక్ష్యం, వసూళ్ళు విషయమై సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా నీటి పన్ను వసూళ్లు, పైపుల లీకులు, క్లోరినేషన్ పద్ధతులు వంటి అంశాలపై కార్యదర్శులు నిర్వహిస్తున్న విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సచివాలయాల వారీగా రూ.20వేలు నీటి పన్ను వసూళ్ళే లక్ష్యంగా అడ్మిన్, ఎమినిటీస్ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా నిర్దేశించిన నీటి పన్ను వసూళ్ళను అధిగమించాలని ఆదేశించారు. మందకొడిగా వసూలు చేస్తున్న కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 30లోగా ప్రత్యేక కార్యచరణ రూపొందించి నీటి పన్ను వసూళ్ళను ముమ్మరం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. తాగునీటి నిర్వహణకు ఇబ్బందులు లేకుండా ఎమినిటీస్ కార్యదర్శులు శ్రద్ధ వహించాలన్నారు. పైప్ లైన్ లీకులను గుర్తించడంతోపాటు తక్షణమే అవి మరమ్మత్తులు చేపట్టే విధంగా చూడాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ఇఇ కె.శ్రీనివాసరావు, ఆర్ఒ శ్రీనివాసరావు, డిఇఇ అప్పారావు, ఆర్ఐ పాల్గొన్నారు.

సీతంలో 'గణితశాస్త్ర అంతర్జాతీయ వెబినార్'

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గణిత శాస్త్రంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వెబినార్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఈ వెబినార్ వివిధ రంగాలలో గణిత శాస్త్ర అనువర్తనాల గురించి వివరించారు. వెబినార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర మ్యాథమెటికల్ సొసైటీ ప్రెసిడెంట్ ఎయు గణిత ప్రొఫెసర్ కె.కె.ఎమ్.శర్మ, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.మీనాక్షి, కార్యదర్శి ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు, జెఎన్‌టియు గురజాడ రీసెర్చ్ అండ్ డెవలపెమెంట్ డైరెక్టర్ ఆచార్య కె.బాబులు, సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల కరస్పాండెంట్ పూజిత, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి- డెంకాడ

జునోసిస్ డే సందర్భంగా శనివారం మండలంలోని పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు అక్కివరం పశు వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుండి రఘుమండ, అక్కివరం పశువుల ఆసుపత్రి వద్ద టీకాలు వేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు వినియోగించుకోవాలని కోరారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని ఎపి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రింగ్‌రోడ్ దాసన్నపేట రైతు బజార్ దగ్గర రజక సంఘం ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు తంగేడు భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరగకుండా చట్టం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా చైర్మన్ అప్పికొండ సన్యాసి, కార్యదర్శి జంపా చిన్న, కోశాధికారి రాజారావు జాయింట్ సెక్రెటరీ చిట్టిబాబు, సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు తాతారావు , శ్రీనురాజు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అడవిపాలెంలో ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ పరిశీలనలో భాగంగా పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

శభాష్ అప్పలనాయుడు

ప్రజా సమస్యలపై ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తొలి ప్రయత్నంలోనే అందరితోనూ శభాష్ అనిపించుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ఆయన కొద్దిరోజుల్లోనే పలుమార్లు అభినందనలు అందుకున్నారు. గత నెల 24న ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి తెలిసిందే. ఆరోజు పార్లమెంట్‌కు సైకిల్‌తో వెళ్లడం అందర్నీ ఆకర్షించాయి. ఆ మరుచటి రోజు నుంచే కేంద్ర మంత్రులను, పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులను కలవడం మొదలుపెట్టి విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంలోని సమస్యలతోపాటు పలు రంగాల్లో ఎదురైన ఇబ్బందులను మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తన తొలి వేతనాన్ని కూడా అమరావతికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు విరాళంగా ఇచ్చారు.

- చంద్రబాబు నుంచి ఎంపి కలిశెట్టికి అభినందనలు
- ప్రజా సమస్యలపై కేంద్ర మంత్రులను కలిసిన ఎంపి
- పరిష్కారమయ్యే వరకూ పోరాడితేనే సార్థకత
- నేడు రాక.. భారీగా స్వాగత ఏర్పాట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత నెల 26న ఎపిలోని మిగిలిన టిడిపి ఎంపీలతోపాటు ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. 27న కేంద్ర పౌరవిమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడ్ని కలిసి విశాఖ నుంచి దుబాయ్ విమాన సర్వీసులను పునరుద్ధరించాలని, సూరత్, ముంబై, వారణాసిలకు కొత్తగా సర్వీసులను అందుబాటులోకి తేవాలని కోరారు. 28న పార్వతీపురం - రాయగడ మధ్యలో మూడు చోట్ల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. 30న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడ్ని కలిసి గ్రంథాలయాల్లో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆవశ్యకత ఉందంటూ వివరించారు. ఈనెల 2న జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ టోల్ ఫీజు నుంచి మినహాయించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. 3న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి జర్నలిస్టులకు కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైల్వే ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. అదే రోజు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడ్ని మరోసారి కలిసిన ఎంపీ కలిశెట్టి తిరుపతి - ఢిల్లీకి విమాన సమయాలు మార్చాలని కోరుతూ వినతి అందజేశారు. తాజాగా శుక్రవారం ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబును కలిసి కేంద్ర ప్రభుత్వం నుంచి తనకు అందిన రూ.1.57లక్షల గౌరవ వేతనాన్ని అమరావతి అభివృద్ధికి విరాళంగా అందజేశారు.

ప్రజాసమస్యలపైనా, వివిధ తరగతులవారు ఎందుర్కొంటున్న ఇబ్బందులపై ఎంపీగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే స్పందించి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమేనని, అయితే, వాటిని పరిష్కరించే వరకు కృషిచేస్తేనే ఫలితం దక్కుతుందని జనం చర్చించుకుంటున్నారు. గతంలో ఎంతో మంది ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిన నేపథ్యంలో ఎంపీ కలిశెట్టి ఈ సమస్యల పరిష్కారం విషయంలో ఎంత వరకు చిత్తశుద్ధి చూపుతారో వేచిచూడాల్సిందే. ప్రధానంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ సాధన దిశగా కృషి చేస్తే ఉపయోగమని జనం అంటున్నారు.

నేడు విజయనగరం రాక

ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కలిశెట్టి అప్పలనాయుడు శనివారం తొలిసారిగా జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన నాయకులు, ఆయన అభిమానులు భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. కలిశెట్టికి స్వాగతం పలుకుతూ విశాఖ నుంచి విజయనగరం వరకు భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. ఉదయం 10గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి విజయనగరం ముఖద్వారం రాజుపేట వద్ద ర్యాలీగా చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం భోజనం అనంతరం అక్కడి నుంచి చింతలవలస మీదుగా విజయనగరంలోని అశోక్ బంగ్లా (టిడిపి జిల్లా కార్యాలయం)కు చేరుకుంటారు. అక్కడి నాయకులు, అభిమానులను కలిసిన అనంతరం నాతవలస, పూసపాటిరేగ మీదుగా రణస్థలంలోని ఆయన స్వగృహానికి చేరుకుంటారు. రణస్థలం - రామతీర్థం జంక్షన్ వద్ద టిడిపి - జనసేన సంయుక్తంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడతారు.

మొక్కలు కనబడటం లేదు

సామాజిక ప్రజావేదికలో తనిఖీ బృందాల వెల్లడి

ప్రజాశక్తి-వంగర

ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెరువు గట్టుపైన వేసిన మొక్కలు కొప్పరవలస, కొప్పర, కింజంగి, ఎం.సీతారాంపురం తదితర గ్రామాల్లో కనబడలేదని సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. గతేడాది ఏప్రిల్ ఒకటో తేది నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పంచాయతీలకు సంబంధించి చర్చ నిర్వహించారు. నీలయ్యవలసలో ప్రజలకు తక్కువ పనులు కల్పించారని, హాజరులో దిద్దుబాట్లు ఉన్నాయని తనిఖీ బృందాలు వెల్లడించాయి. ప్రజలకు పనులు కల్పించని ఫీల్డ్ అసిస్టెంట్ అవసరమా? ఇదే తీరు కనబరిస్తే విధుల నుంచి తొలగిస్తామని పీడీ హెచ్చరించారు. కొప్పరవలసలో వేతనదారులకు వేతనం ఎక్కువ రావాలంటే డబ్బులు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ డిమాండ్ చేసినట్టు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. ఈ విషయంపై మరోసారి సమగ్రమైన దర్యాప్తు జరపాలని ఎపిడిని పీడీ ఆదేశించారు. ఇదే రుజువైతే ఫీల్డ్ అసిస్టెంట్‌ని తొలగిస్తామన్నారు. రాజుల గుమ్మడలో చనిపోయిన వారి పేర్లతో మస్టర్లు వేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. పటువర్ధనం, కింజగి ఆర్‌ఆర్ కాలనీ, ఓని, మగ్గూరు గ్రామాలలో ఉపాధి హామీ పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, పనులు కల్పించాలని ప్రజల నుంచి వినతులు అందినట్లు సామాజిక తనిఖీ బృందాలు ప్రజా వేదికలో వెల్లడించాయి. శివ్వాంలో ఫీల్డ్ అసిస్టెంట్ విధులు సక్రమంగా నిర్వహించలేదని మెమో అందజేశారు.

ఎమ్మెల్యేకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఎపిఒను ప్రశ్నిస్తున్న కృష్ణమూర్తి

ఎమ్మెల్యేకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు?

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహించినప్పుడు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని టిడిపి వాణిజ్య విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లచ్చుబుక్త కృష్ణమూర్తి.. ప్రజావేదికలో ఎపిఒ సత్యవతిని ప్రశ్నించారు. ఇకపై ఇలాంటి తప్పిదాలు లేకుండా చూస్తామని ఎపిఒ బదులిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె.బానోజీరావు, ఎపిడిలు ఎం.శ్రీనివాసరావు, టి.జనార్ధన, ఎస్ఆర్‌పి కె.మన్మథరావు, ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, కరణం సుదర్శనరావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి, ఎపిఎం చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు చెప్పారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కలెక్టర్‌ను బేబినాయన కోరారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బేబినాయన

సమస్యలపై చర్చించని గ్రామసభలెందుకు?

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గ్రామ సమస్యలపై చర్చించని గ్రామసభలు ఎందుకని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో గ్రామసభ ఏర్పాటుచేశారు. దీనిపై గ్రామ ప్రజానీకానికి ఎవరికీ సమాచారం లేదని, తెలిస్తే గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తారని భయపడి ఎవరికీ తెలియనీకుండా గ్రామసభ నిర్వహించడం దారుణమని ఆయన ఆక్షేపించారు. సచివాలయంలో అధికారులు, సిబ్బంది కూర్చొని చాయ్, బిస్కెట్లు తెప్పించుకొని మమా అనిపించారని మండిపడ్డారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధికి ఎన్‌డిఎ ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండవెలగాడలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ విద్య అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, బిజెపి నాయకులు బుర్లె శ్రీధర్, సర్పంచ్ గదల బంగారమ్మ, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎంపిడిఒ జి.రామారావు, ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఇ.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

వేపాడ : సోంపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ అందజేస్తున్న సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బక్కునాయుడుపేట గురుకుల విద్యార్థినులు ప్రదర్శించిన థింసా నృత్యం ఆకట్టుకుంది. వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపుతో ప్రయోజనం

ప్రజాశక్తి-డెంకాడ

కౌలుగుర్తింపు కార్డులతో కౌలురైతులకు ఎంతో ప్రయోజనమని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు తెలిపారు. కౌలురైతుల గుర్తింపు కార్డుల అవగాహన సదస్సులను మండలంలో పెదతాడివాడ, పినతాడివాడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుగుర్తింపు కార్డుల వల్ల ప్రయోజనాలను వివరించారు. వాటిని ఎలా పొందాలో రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఆదినారాయణ, ఎఒ నిర్మల, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, పెదతాడివాడ ఎంపిటిసి గాదిపల్లి రమేష్, జగన్నాథం విఎఎలు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కౌలుకార్డులు కౌలురైతులకు ఎంతో ఉపయోగమని మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని సంతగౌరమ్మపేట, పెదకండేపల్లి, కొత్తూరు, ఉసిరి, తిమిడి గ్రామాల్లో కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకార్డు వల్ల పంట నమోదు, పంట నష్టం, ధాన్యం కొనుగోలు, బీమా, రుణాలకు అర్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు రవి, పుష్ప, వివేక్, శిరీష, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడి రామారావు

ఎంఆర్‌పికే విత్తనాలు విక్రయించాలి

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి తాతారావు

ప్రజాశక్తి-రామభద్రపురం

రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు ఎంఆర్‌పికి మాత్రమే విక్రయించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి తాతారావు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీ వాసవి ఫెస్టిసైడ్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎడిలు గంగాధర్‌రావు, శ్యామసుందర్ ఆధ్వర్యంలో స్టాక్ రిజిష్టర్ పరిశీలించారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నిల్వలు స్టాక్ రిజిష్టర్ మేరకు ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. చాలా వాటిలో వ్యత్యాసాలు ఉన్నట్లు గమనించారు. దీనిపై ఆయా కంపెనీ వారి వివరణలు తీసుకోవాల్సి ఉన్నట్లు తెలిపారు. లైసెన్స్‌లో పేర్కొన్న డోర్ నంబర్, ప్రస్తుతం నడుస్తున్న డోర్ నంబర్‌లో కూడా వ్యత్యాసం ఉన్నట్లు గమనించారు. షాపులో కాలం చెల్లిన స్టాక్స్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ వస్తు సామగ్రి అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతీ కొనుగోలుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. తనిఖీల్లో ఎఒ వెంకటయ్య, సహాయకులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి తాతారావు

శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉచిత షుగర్, బిపి తనిఖీ శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యప్పనగర్ సాయి అమృతా రెసిడెన్సీ వద్ద శుక్రవారం క్వీన్ ఎన్ఆర్ఐ ఆధ్వర్యాన ఉచిత షుగర్, బిపి తనిఖీ శిబిరం నిర్వహించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ శిబిరంలో సుమారు 50 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్ప నగర్ పోరాట కమిటీ కన్వీనర్ యుఎస్ రవి కుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత శిబిరం ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. త్వరలోనే ఐదుగురు వైద్యులతో ఇసిజితో సహా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

గోగుసాగు పరిశీలన

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని గజరాయనివలసలో రైతు శంకరరావు పొలంలో చిరుసంచులతో అధిక దిగుబడినిచ్చే గోగు, వేరుశనగ విత్తనాలను ప్రయోగాత్మకంగా సాగుచేశారు. ఈ పంటలను శుక్రవారం డాట్ శాస్త్రవేత్తలు ఎం.ఎం.శ్రీనివాస్, కల్లా లక్ష్మణ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎఒ శిరీష, ఎఇఒ పుష్పలత, విఎఎ స్రవంతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి-గరివిడి

చట్టాలపై అవగాహనతోనే మానవ హక్కుల పరిరక్షణ సాధ్యపడుతుందని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బొడ్డపాటి దాసు అన్నారు. శుక్రవారం గరివిడిలో మానవ హక్కులు, పోక్సో చట్టం, వినియోగదారుల చట్టాలపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. అనేక సందర్భాల్లో మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో హక్కుల పరిరక్షణకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంపిడిఒ మధుసూదన్ రావు, ఎస్ఐ దామోదర్ రావు, గరివిడి పిహెచ్‌సి వైద్యాధికారి దీప్తి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు బి.శ్రీదేవి, సిరువూరు లక్ష్మి వర్మ, బి.శ్రీనివాసరావు, హరీష్‌కుమార్, వై.వి. రామ్మోహన్ రావు, బి.పోలీస్, ఎపిడి కనకరాజు, ఎంఇఒ రామారావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లీల కుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పోలిరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విభాగాలో సేవలందించిన అధికారులు, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-డెంకాడ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన చట్టాలు ప్రతిఒక్కరూ తెలుసుకొని, వాటికి అనుగుణంగా ప్రజలు నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి, ఎఎస్ఐ మురళి, తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులకు వేలం వేయండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ చెరువులను గుర్తించి వాటిలో చేపల పెంపకానికి వేలం ప్రక్రియ నిర్వహించాలని వైస్ ఎంపిపి ముషిడిపల్లి ఎంపిటిసి సభ్యురాలు ఇందుకూరి సుధారాజు కోరారు. శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ చాలా వరకు ప్రభుత్వ చెరువులు ఆక్రమణంలో ఉన్నాయని, గత ప్రభుత్వంలో ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం కనిపించలేదన్నారు. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడిందని ఈ ప్రభుత్వంలో ఎవరు ఎటువంటి అవినీతి చేసినా సహించేది లేదని తేల్చి చెప్పారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ చెరువుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి వేలం ప్రక్రియను జిల్లా అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దారప్ప, ఉప సర్పంచ్ మేడప రెడ్డి గణేష్, విఆర్ఒ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని రైతు మృతి

ప్రజాశక్తి-బాడంగి

వ్యవసాయ పనులకు వెళ్తూ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గొల్లాది గ్రామానికి చెందిన మన్నెల పోలీసు (48) మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం గొల్లాది సమీపంలోని నక్కలబంద వద్ద చోటుచేసుకుంది. పొలానికి వెళ్తానన్న వ్యక్తి రైలు పట్టాలపై శవంగా కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసుకు భార్య అప్పమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు జిఆర్‌పి హెచ్‌సి ఈశ్వరరావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి మృతదేహాన్ని తరలించారు.

పోలీసు(ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-గజపతినగరం

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం గుర్ల మండలం గరికివలస గ్రామానికి చెందిన గుమ్మడి శంకర్రావు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా కెంగువ గ్రామ సమీపంలో పట్టుకుని, స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి ఆలయ సమీపాన జాతీయ రహదారిపై యువకుల అప్రమత్తత కారణంగా శుక్రవారం పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం... బొబ్బిలి నుంచి అతివేగంగా వస్తున్న ఆర్‌టిసి బస్సు.. రామభద్రపురం నుంచి బొబ్బిలి ద్విచక్రవాహనంపై వెళ్తున్న కుమార్, లక్ష్మణ్‌పైకి దూసుకొచ్చింది. అతివేగంగా వస్తున్న బస్సు కదలికలు గమనించి బైక్ వదిలేసి వారు పక్కకు దూకారు. దీంతో స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా పాడైంది. ఆర్‌టిసి బస్సును స్టేషనుకు తరలించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.